సాక్షి తూర్పుగోదావరి

మంగళవారం । 21 । ఫిబ్రవరి । 2023



మానవత్వం చాటుకున్న సీఎం

తలసేమియా వ్యాధితో బాధ పడుతున్న ఓ చిన్నారి చికిత్సకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మానవతా దృక్పథంతో రూ.15 లక్షలు మంజూరు చేశారు. - 8లో▸



అన్నదానానికి విరాళం

సామర్లకోట: భీమేశ్వరస్వామి ఆలయంలో అన్నదాన పథకానికి గంటి కామేశ్వరరావు, భాను దంపతులు (హైదరాబాద్) సోమవారం రూ.25 వేల విరాళం సమర్పించారు.

డెల్టాలకు నీరు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు సోమవారం 6,89 5 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,030, మధ్య డెల్టాకు 1,325, పశ్చిమ డెల్టాకు 3,540 క్యూసెక్కుల నీటిని వదిలారు.

న్యూస్‌రీల్

సీడీసీ డీన్‌గా ఆచార్య రమేష్



వీసీ ప్రసాదరాజు నుంచి ఉత్తర్వులు అందుకుంటున్న ఆచార్య రమేష్, పక్కన రిజిస్ట్రార్ ఆచార్య అశోక్

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ డీన్‌గా ఆచార్య కేఎస్ రమేష్‌ను నియమించారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులను ఇన్‌చార్జి వీసీ ఆచార్య జీవీఆర్ ప్రసాదరాజు నుంచి రమేష్ సోమవారం అందుకున్నారు. అనుబంధ కళాశాలలకు సంబంధించి యూనివర్సిటీ కాలేజ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ కీలకపాత్ర వహిస్తుందని రమేష్ అన్నారు. ఈ పదవితో పాటు ప్రస్తుతం ఉన్న తాడేపల్లిగూడెం క్యాంపస్ ప్రిన్సిపాల్‌గా అదనపు బాధ్యతలను కూడా నిర్వహిస్తారన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్ ప్రారంభం

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): ఇంటర్మీడియేట్ ప్రాక్టికల్ పరీక్షలు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. గత ఏడాదిలానే తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలు ఒకే కేంద్రంగా నిర్వహించారు. ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ మొదటి సంవత్సరం పరీక్షలు జరిగాయి. దీనికి 1,535 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1,353 మంది వచ్చారు. 182 మంది గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 1,214 మంది పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 1,143 మంది పరీక్షలు రాశారు. 71 మంది గైర్హాజరయ్యారు. ఈ పరీక్ష కేంద్రాలను ఆర్జేడీ ఐ.శారద పర్యవేక్షించారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు లేకుండా పరీక్షలు సజావుగా జరిగాయని ఇంటర్మీడియేట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎస్ఎస్ఎల్‌వీ నరసింహం వివరించారు.

26న అండర్-13 చదరంగ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆంధ్రా చెస్ అసోసియేషన్ సహకారంతో జిల్లా అండర్-13 ఓపెన్ చెస్ చాంపియన్ షిప్‌పోటీలు ఈనెల 26న జిల్లా క్రీడామైదానంలో నిర్వహించనున్నారు. ఈ టోర్నమెంట్ కో-ఆర్డినేటర్ మనే మనోహర్ సోమవారం ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. అండర్-13 బాలురు, బాలికల విభాగంలో పోటీలు జరుగుతాయన్నారు. 1-1-2010 తర్వాత పుట్టిన వారు పోటీలకు అర్హులన్నారు. ఎంట్రీ ఫీజు రూ.200 చెల్లించాలన్నారు. ఆసక్తి గలవారు 8499977456 నెంబరులో సంప్రదించాలని సూచించారు.

బ్యూటీ సెంటరుపై పోలీసుల దాడి

- అభ్యంతరకర వీడియోలపై ఆరోపణలు
- నిర్వాహకురాలు అరెస్టు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం ఏవీ రోడ్డులోని బ్యూటీ పై స్పాపై పోలీసులు సోమవారం రాత్రి దాడి చేశారు. నిర్వాహకురాలిని అరెస్టు చేశారు. సీఐ పవన్‌కుమార్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. 2021 నుంచి బ్యూటీ పై స్పా పేరుతో విజయలక్ష్మీ నిర్వహిస్తోంది. సెలూన్, బ్రైడల్ మేకప్‌తో పాటు పలు సర్వీసులను అందిస్తున్నారు. మసాజ్ సర్వీసులూ అందిస్తున్నారు. ముగ్గురు యువతులు ఇందులో పని చేస్తున్నారు. మసాజ్ పూర్తయిన తర్వాత కస్టమర్లు కొంత సొమ్ము టిప్పుగా ఇచ్చేవారు. దీంతో వర్కర్లకు నిర్వాహకురాలు జీతాలు ఇవ్వడం మానేసింది. కోపంతో వర్కర్లు నిలదీశారు. టిప్పు డబ్బులు బాగా వస్తున్నాయంటూ నిర్వాహకురాలు బదులిచ్చింది. దీంతో ఇద్దరు యువతులు పని మానేసి వెళ్లిపోయారు. కొద్ది నెలలు చేసిన తర్వాత తానూ మానేస్తానని మరో యువతి చెప్పింది. దీంతో నిర్వాహకురాలు ఆమెను బెదిరించింది. మసాజ్ సమయంలో తీసిన కొన్ని అసభ్యకర వీడియోల ను చూపించింది. పనిమానేస్తే వాటిని బయటపెడతానని పేర్కొంది. బాధిత యువతి కుటుంబ సభ్యులు వచ్చి స్పా సెంటర్ వద్ద గొడవకు దిగారు. విషయం తెలుసుకున్న సీఐ పవన్‌కుమార్‌రెడ్డి, ఎస్సై ప్రేమ్‌రాజ్ పసుపులేటి, పోలీసులు స్పాం సెంటర్‌కు చేరుకుని సోదాలు నిర్వహించారు. సెల్‌ఫోన్, రిజిస్టర్‌ను సీజ్ చేశారు.

26న అండర్-13 చదరంగ పోటీలు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): ఆంధ్రా చెస్ అసోసియేషన్ సహకారంతో జిల్లా అండర్-13 ఓపెన్ చెస్ చాంపియన్ షిప్‌పోటీలు ఈ నెల 26న జిల్లా క్రీడామైదానంలో నిర్వహించనున్నట్టు టోర్నీ కో-ఆర్డినేటర్ మనే మనోహర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-13 బాలురు, బాలికల విభాగంలో పోటీలు జరుగుతాయన్నారు. 1-1-2010 తర్వాత పుట్టిన వారు పోటీలకు అర్హులన్నారు. ఎంట్రీ ఫీజు రూ.200 చెల్లించాలన్నారు. ఆసక్తి గలవారు 84999 77456 నంబరులో సంప్రదించాలన్నారు.

పెద్దల సభలో పెద్దపీట

- ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో సామాజిక సమతూకం
- విద్యాధికులకు సముచిత స్థానం
- ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురికి చాన్స్
- శెట్టిబలిజ, మత్స్యకారులకు చెరొకటి
- చరిత్రలోనే తొలిసారి మాదిగలకు చోటు



సాక్షి ప్రతినిధి, కాకినాడ: పెద్దల సభలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు అగ్రాసనం లభించింది. ఎమ్మెల్సీల భర్తీలో వైఎస్సార్ సీపీ అధిష్ఠానం సామాజికవర్గాల సమతూకాన్ని పాటించింది. బీసీ, ఎస్సీలకు సముచిత స్థానాన్ని కల్పించింది. మునుపెన్నడూ ఏ పార్టీ చేయని విధంగా సాహసోపేతమైన అడుగు వేసింది. శాసన మండలిలో ఖాళీ అయిన స్థానాలకు సోమవారం ప్రకటించిన జాబితాలో తమ వర్గాలకు ప్రాధాన్యం ఇవ్వడంతో బీసీ, ఎస్సీ వర్గాల్లో ఆనందోత్సాహాలు వ్యక్తమవుతున్నాయి. శాసన మండలి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గం నుంచి చిక్కాల రామచంద్రరావు పదవీ కాలం ముగియనుంది. ఈ స్థానంలో కుడుపూడి సూర్యనారాయణరావును వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా ప్రకటించింది. ఎమ్మెల్యే కోటా అభ్యర్థిగా కూడా కోనసీమ జిల్లాకే చెందిన రాష్ట్ర మాదిగ పొలిటికల్ జేఏసీ చైర్మన్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మి ఇజ్రాయిల్‌ను ఎంపిక చేసింది. ఈ విధంగా కోనసీమ జిల్లా నుంచి బీసీ, ఎస్సీలకు అత్యధిక ప్రాధాన్యం కల్పించింది. గవర్నర్ కోటాలో కాకినాడ జిల్లా నుంచి కర్రి పద్మశ్రీని ఎంపిక చేసింది. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక తాజా నియామకాలను కలుపుకొంటే ఏడుగురికి పెద్దల సభలో ప్రాతినిధ్యం లభించింది. తాజాగా ఎంపికైన ముగ్గురూ విద్యాధికులే.

రాజకీయ కుటుంబం నుంచి..



సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న కుడుపూడి సూర్యనారాయణరావు

పేరు: కుడుపూడి సూర్యనారాయణరావు
భార్య: డాక్టర్ విజయ
తల్లిదండ్రులు: గోపాలకృష్ణగోఖలే ఐపీఎస్, మహాలక్ష్మి
విద్య: ఎంఏ, ఎంఏ, బీఎల్
ప్రస్తుత పదవులు: ఉభయ తెలుగు రాష్ట్రాల శెట్టిబలిజ మహానాడు కన్వీనర్, ఏపీ బీసీ కుల సంఘాల కన్వీనర్
రాజకీయ నేపథ్యం: తాతయ్య, చిన్నాన్నల స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చారు. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వానికి ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరారు.

ఆవిర్భావం నుంచీ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా బీసీల్లో బలమైన శెట్టిబలిజ సామాజికవర్గానికి వైఎస్సార్ సీపీ అగ్రాసనం వేస్తూ వస్తోంది. ఇదే సామాజికవర్గం నుంచి పిల్లి సుభాష్‌చంద్రబోస్‌ను ఎమ్మెల్సీగా ఎంపిక చేసి డిప్యూటీ సీఎం, రెవెన్యూ మంత్రి పదవులు కేటాయించింది. అనంతరం ఈ వర్గం నుంచి తొలిసారిగా రాజ్యసభకు పంపింది. తొలిసారి ఎమ్మెల్యే అయిన చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణను క్యాబినెట్‌లోకి తీసుకుంది. అలాగే విద్యావంతుడు, ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో పట్టున్న నాయకుడు అయిన కుడుపూడి సూర్యనారాయణరావును తాజాగా ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేసింది. ఆయన ఆంధ్రా యూనివర్సిటీలో విద్యార్థి నేతగా, కోనసీమలో సూరిసేన పేరుతో గ్రామగ్రామాన యువతను చైతన్యపరిచారు. తాత దివంగత సూర్యనారాయణ ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో ఎమ్మెల్సీగా, అమలాపురం మున్సిపాలిటీ తొలి చైర్మన్‌గా ఎన్నికయ్యారు. చిన్నాన్న దివంగత కుడుపూడి ప్రభాకరరావు అమలాపురం నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యే, వాణిజ్య పన్నుల మంత్రిగా పని చేశారు. సూర్యనారాయణ తండ్రి దివంగత గోపాలకృష్ణ గోఖలే ఐపీఎస్ అధికారిగా చేశారు. బాస్కెట్ బాల్, వాలీబాల్, బాడీబిల్డింగ్, వెయిట్ లిఫ్టింగ్‌లలో సూర్యనారాయణ జాతీయ స్థాయి క్రీడాకారుడు కూడా.

ఉప సర్పంచ్ నుంచి ఎమ్మెల్సీగా..



ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్న ఇజ్రాయిల్

పేరు: బొమ్మి ఇజ్రాయిల్
స్వగ్రామం: గోడి, అల్లవరం మండలం
పుట్టిన తేదీ: 15.05.1973
విద్య: బీఏ
భార్య: హైమావతి
సంతానం: కుమారుడు, కుమార్తె
ప్రస్తుత పదవులు: రాష్ట్ర మాదిగ పొలిటికల్ జేఏసీ చైర్మన్
రాజకీయ నేపథ్యం: ఆవిర్భావం నుంచీ వైఎస్సార్ సీపీలో క్రియాశీలకంగా ఉన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా పని చేస్తున్నారు. అమలాపురం ఎస్‌కేబీఆర్ కాలేజీలో విద్యార్థి ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారు. మాదిగ రిజర్వేషన్ల కోసం జరిగిన పోరాటాల్లో కూడా పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలం గోడి గ్రామానికి చెందిన బొమ్మి ఇజ్రాయిల్‌ను ఎస్సీ మాదిగ సామాజికవర్గం నుంచి ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేశారు. అమలాపురం ఎస్‌కేబీఆర్ కాలేజీలో విద్యార్థి దశ నుంచీ ఈయన ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారు. కోనసీమ దండోరా ఉద్యమాల్లో పాల్గొన్నారు. డిగ్రీ చదివిన ఇజ్రాయిల్.. ఆవిర్భావం నుంచీ వైఎస్సార్ సీపీలో క్రియాశీలకంగా పని చేశారు. గోడి ఉప సర్పంచ్ స్థాయి నుంచి ఇజ్రాయిల్ ఎమ్మెల్సీ కాబోతున్నారు. స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ల చరిత్రలో మాదిగ సామాజికవర్గాన్ని తొలిసారి పెద్దల సభకు పంపించిన ఘనత వైఎస్సార్ సీపీకే దక్కుతోంది. మునుపెన్నడూ ఏ రాజకీయ పార్టీ కూడా ఈ సామాజికవర్గాన్ని రాజకీయంగా గుర్తించి, చట్టసభలకు అందునా పెద్దల సభకు పంపించిన దాఖలాలు లేవు. తొలిసారి పెద్దల సభకు మాదిగ సామాజికవర్గాన్ని పంపించడంతో ఆ వర్గాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది.

పని చేస్తే పట్టాభిషేకం



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న పద్మశ్రీ. చిత్రంలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి

పేరు: కర్రి పద్మశ్రీ
భర్త: నారాయణరావు
పుట్టిన తేదీ: 17.06.1976
విద్యాభ్యాసం: ఇంగ్లిష్ లిటరేచర్, పొలిటికల్ సైన్స్‌లో పీజీ. నేషనల్ అగ్రికల్చరల్ ఫెడరేషన్‌లో పని చేశారు.
పిల్లలు: శ్రీశయన, శ్రీశ్రియన
రాజకీయ నేపథ్యం: వైఎస్సార్ సీపీలో 2009లో క్రియాశీలక సభ్యురాలిగా చేరారు. 2014 నుంచి రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పని చేస్తున్నారు.

కాకినాడకు చెందిన కర్రి పద్మశ్రీని గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీగా ఎంపిక చేశారు. మత్స్యకార సామాజిక వర్గంలో ఈమె విద్యాధికురాలు. పద్మశ్రీ భర్త కర్రి నారాయణరావు పార్టీ ఆవిర్భావం నుంచీ క్రియాశీలకంగా ఉంటున్నారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పని చేశారు. పద్మశ్రీ ఎంపికలో కాకినాడ సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి కీలక భూమిక పోషించారు. క్రమశిక్షణతో పని చేసిన వారికి సమయం వచ్చినప్పుడు సముచిత స్థానం దక్కుతుందని ఈమె ఎంపిక మరోసారి రుజువు చేసింది. పద్మశ్రీ మామ రామచంద్రరావు శాస్త్రవేత్త, రాజ్యసభ సభ్యుడు, యూజీసీ చైర్మన్. ఆంధ్రా యూనివర్సిటీ వైస్ చాన్సలర్‌గా విశేషమైన సేవలందించారు. వీటన్నింటినీ పరిగణనలోకి తీసుకునే ఈమె పేరును ఎమ్మెల్సీకి ప్రతిపాదించారు. గతంలో రాష్ట్ర మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్‌గా కాకినాడ నుంచి బందన హరికి ఇప్పించిన చంద్రశేఖరరెడ్డి ఈసారి గవర్నర్ కోటాలో అదే సామాజికవర్గం నుంచి మహిళను ఎంపిక చేయడంలో క్రియాశీలకంగా వ్యవహరించారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో వైఎస్సార్ సీపీ తరఫున ఎస్సీ సామాజికవర్గం నుంచి పండుల రవీంద్రబాబు, కాపు సామాజికవర్గం నుంచి తోట త్రిమూర్తులు ఎమ్మెల్సీలుగా ఉన్నారు.

బాలికా దినోత్సవ పోటీల విజేతలకు బహుమతులు



విజేతలతో కలెక్టర్ మాధవీలత

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): గతనెలలో జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా వివిధ అంశాల్లో నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు కలెక్టర్ మాధవీలత సోమవారం నగదు పురస్కారంతో పాటు మెరిట్ సర్టిఫికెట్లను అందచేశారు. వ్యాసరచన పోటీల్లో మల్లవరం జెడ్పీహెచ్ఎస్ స్కూల్ విద్యార్థిని ఆర్ శాంత కుమారి మొదట బహుమతి కింద రూ.6వేలు నగదు అందుకుంది. రాజమహేంద్రవరం ఎస్ఎస్ఎంసీహెచ్ స్కూల్ విద్యార్థి ఎస్ పవన్ కుమార్ రెండవ బహుమతి కింద రూ.3000 నగదు, ప్రశంసా పత్రం అందుకున్నాడు. సీతానగరం మండలం విధులపల్లి జెడ్పీ స్కూలు విద్యార్థిని ఎం నవ్య రూ.2000 నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందుకుంది. వక్తృత్వ పోటీలలో ఎస్ఎస్‌సీ హైస్కూలు విద్యార్థిని ప్రథమ స్థానం కె గీతాంజలి రూ.6000 నగదుతోపాటు ప్రసంసా పత్రాన్ని అందుకుంది. రాజమహేంద్రవరం లాలాచెరువు మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ విద్యార్థిని జ్యోతిర్మయి రెండో స్థానంలో రూ.3వేలు నగదు.. సీతానగరం మండలం ప్రభాకర్ నగర్ జెడ్పీ హైస్కూలుకు చెందిన పి శ్రీవల్లి మూడో స్థానంలో నిలిచి బహుమతులను పొందారు. చిత్రలేఖన పోటీలలో రాజమహేంద్రవరం లాలాచెరువు మున్సిపల్ హైస్కూల్ హైస్కూల్ విద్యార్థి ఎస్ దినేష్ మొదటి..రాజమహేంద్రవరం ఎస్‌కేవైటీ ప్రభుత్వ హైస్కూలుకు చెందిన కే ప్రవల్లిక ద్వితీయ.. రాజమహేంద్రవరం గవర్నమెంట్ గరల్స్ హైస్కూలుకు చెందిన కే భాగ్యలక్ష్మి మూడో స్థానంలో నిలిచి బహుమతులు పొందారు. ఈ కార్యక్రమంలో డా. ఎస్ వసుంధర, డీఈవో ఎస్ అబ్రహం, డిప్యూటీ డెమో ఎస్ సత్యకుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

స్పందన అర్జీలకు వేగంగా పరిష్కారం

కలెక్టర్ మాధవీలత



స్పందనలో అర్జీదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): కలెక్టరేట్‌లో సోమ వారం స్పందన కార్యక్రమం జరిగింది. కలెక్టర్ మాధ వీలతతోపాటు అధికారులు పాల్గొని విన్నపాలను స్వీకరించారు. స్పందన అర్జీలకు సాధ్యమైనంత తొందరగా పరిష్కారం చూపాలని కలెక్టర్ అధికారులను సూచించారు అర్జీ వచ్చిన 24 గంటలలోపు వెబ్ సైట్ ఓపెన్ చేసి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. స్పందన కంట్రోల్ యూనిట్ ఏర్పాటు చేసి పర్యవేక్షణకు అధికారులను నియమించాలన్నారు. భూ సమస్యలపై ఆర్డీవో కార్యాలయాల్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. జేకేసీ వెబ్ పోర్టల్‌పై బుధవారం స్పందన వర్క్ షాప్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. జిల్లాలో సచివాలయ పరిధిలో పర్సన్, డిజిటల్ అసిస్టెంట్, కార్యదర్శులు, ఇతర శాఖలకు సంబంధించిన సిబ్బందిలో ఇంతవరకు ప్రొ బేషన్ డిక్లేర్ కాని వారు ఎవరైనా ఉంటే కారణాలు తెలియజేస్తూ సీసీఎల్ రూల్స్ ప్రకారం నివేదిక పంపాలని స్పష్టం చేశారు. తాజాగా ప్రజల నుంచి 149 అర్జీలను స్వీకరించారు. డీఆర్‌ఓ నరసింహులు పాల్గొన్నారు.

రెండు పోలింగ్ కేంద్రాల ఏర్పాటు–

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్ పరిధిలో రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ మాధవీలత తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి అమరావతి నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌కు సోమవారం ఆలె కలెక్టరేట్ నుంచి హాజరయ్యారు. వివిధ అంశాలపై సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ, కాకినాడ, ఏలూరు జిల్లా కలెక్టర్‌లతో ఎన్నికల ఏర్పాట్లపై ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకుంటున్నామన్నారు.

బీసీలకు సీఎం పట్టాభిషేకం

ఎంపీ మార్గాని భరత్ హర్షం



రాజమహేంద్రవరం రూరల్: ఆంధ్రప్రదేశ్ శాసనమండలిలో ఖాళీ అయిన స్థానాల్లో అత్యధికం బీసీలకు కేటాయించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద మనసు చాటుకున్నారని ఎంపీ మార్గాని భరత్ రామ్ హర్షం వ్యక్తం చేశారు .సీఎంకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర చరిత్రలో ఏ ప్రభుత్వమూ, ఏ పార్టీ ఈ స్థాయిలో వెనుకబడిన కులాలకు రాజకీయంగా పట్టాభిషేకం చేయలేదన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కోటాలో తొమ్మిదింటిలో బీసీలకు ఆరు కేటాయించారన్నారు. ఎమ్మెల్యే కోటాలో ఏడు స్థానాలలో నాలుగు, గవర్నర్ కోటాలో ఒకటి బీసీకి కేటాయించారని ఆనందం వ్యక్తం చేశారు. బీసీలు ఏనాటి నుండో కలలు కంటున్న రాజ్యాధికారాన్ని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో వాస్తవ రూపం దాల్చుతోందన్నారు. 2014–19 వరకూటీడీపీ చంద్రబాబు హయాంలో బీసీలను ఓటు బ్యాంక్‌గా మాత్రమే వాడుకున్నారన్నారు.

భవితకు భరోసా.. పాలిటెక్నిక్



- పాలిసెట్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభం
- జిల్లాలోని 8 కళాశాలల్లో 1,820 సీట్లు
- విద్యార్థుల సౌకర్యార్థం హెల్ప్‌లైన్ ఏర్పాటు
- ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ



శిక్షణ పొందుతున్న పాలిటెక్నిక్ విద్యార్థులు

రాజమహేంద్రవరం రూరల్: పాలిటెక్నిక్ కోర్సు చదవాలనుకునే ఔత్సాహికులకు సమయం ఆసన్నమైంది. ఈ కోర్సులలో ప్రవేశానికి సాంకేతిక విద్యా శాఖ ఇప్పటికే పాలిసెట్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 16వ తేదీన దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో ఎనిమిది పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. 12 బ్రాంచిలలో 1,820 సీట్లు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వ ఆధ్వర్యాన బొమ్మూరులో జీఎంఆర్, అనపర్తిలోను పాలిటెక్నిక్ కళాశాలలు నిర్వహిస్తున్నారు. వీటిలో 360 సీట్లు అందుబాటులో ఉన్నాయి. మిగిలిన ఆరు ప్రైవేటు కాలేజీల్లో 1,460 సీట్లు ఉన్నాయి. ప్రభుత్వ కాలేజీల్లో కోర్సులకు ఏడాదికి ఫీజు రూ.4,700. ప్రైవేటు కళాశాలల్లో సీటు లభిస్తే రూ.25 వేలు చెల్లించాలి. పాలిటెక్నిక్ కోర్సులలో ఉత్తీర్ణులైతే ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగం గ్యారెంటీగా వస్తుందనే భావన పెరగడంతో వీటికి ఎంతో క్రేజ్ ఉంది. పైగా పాలిటెక్నిక్ పాసైతే బీటెక్ రెండో సంవత్సరంలో నేరుగా చేరవచ్చు. ఈ నేపథ్యంలో ఈసారి ఎక్కువ మంది పాలిసెట్‌పై దృష్టి సారిస్తున్నారు.

ఇదీ షెడ్యూల్

- పాలిసెట్ పరీక్ష రాసేందుకు పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులు.
- దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 30వ తేదీ వరకూ గడువు ఉంది.
- మే 10న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. మే 25న ఫలితాలు వెల్లడిస్తారు.
- ఎంట్రన్స్ రాసేందుకు ఓసీ, బీసీ వర్గాల విద్యార్థులు రూ.400; ఎస్సీ, ఎస్టీ వర్గాల వారు రూ.100 చొప్పున ఫీజు చెల్లించాలి.
- తగిన ధ్రువీకరణ పత్రాలతో http://polycetap.nic.in అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- బొమ్మూరులోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలోను, అనపర్తిలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోను హెల్ప్‌లైన్ సెంటర్లు ఏర్పాటు చేశారు.

ఉజ్వల భవిష్యత్

పాలిటెక్నిక్ కోర్సు ఉద్యోగ బాట చూపుతుందని ఇప్పుడు ఎక్కువ మంది విశ్వసిస్తున్నారు. దీనికి కారణం ఈ కోర్సు పూర్తి చేసిన వారు చదువు పూర్తయ్యాక బీటెక్ చదవడమో.. లేదా అదే అర్హతతో ఉద్యోగం పొందడమో జరుగుతోంది. పాలిటెక్నిక్‌లో కోర్ బ్రాంచిలు సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, కంప్యూటర్ కోర్సులు చేస్తున్న వారికి ఉద్యోగాలు బాగానే దక్కుతున్నాయి. జిల్లాలో కొత్త పరిశ్రమల స్థాపనకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రోత్సాహాన్ని అందిస్తుండటంతో కోర్ బ్రాంచిలు చదివిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెరుగవనున్నాయి. ప్రభుత్వ కాలేజీలకు మంచి డిమాండ్ ఉంటుందని భావించి సీటు సంపాదించేందుకు ఎక్కువ మంది కష్టపడి పాలిసెట్ రాస్తున్నారు. ఇలాంటి వారికి ఉపయోగపడేలా ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల వారీగా ఉన్న సీట్లు, ఫ్యాకల్టీ, వసతి వంటి అంశాలపై కరపత్రాలు ముద్రించి విస్తృత ప్రచారం చేయాలని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నాగరాణి సంకల్పిస్తున్నారు.

ఆన్‌లైన్‌లో ఉచితంగా పాలిసెట్ కోచింగ్



పాలిసెట్ రాసే విద్యార్థుల కోసం జీఎంఆర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల లెక్చరర్లు ఆన్‌లైన్ ద్వారా ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నారు. ఆసక్తి గల అభ్యర్థులు http://www.teachmint.com (ఎన్‌రోల్ ఐడి: 5813511233) వెబ్‌సైట్ ద్వారా ఎన్‌రోల్ చేసుకోవాలి. మ్యాథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లో కోచింగ్ ఇస్తున్నారు. పదో తరగతి పరీక్షలకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా ఆన్‌లైన్‌లో హాజరు కావచ్చు.

– వి.నాగేశ్వరరావు, పాలిసెట్ కన్వీనర్, ప్రిన్సిపాల్, జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల, బొమ్మూరు, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

కుక్కుటేశ్వరునికి వైభవంగా త్రిశూలస్నానం



కుక్కుటేశ్వరస్వామి, అమ్మవార్లకు త్రిశూల స్నానం చేయిస్తున్న అర్చకులు

పిఠాపురం: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా పాదగయ క్షేత్రంలో ఐదో రోజైన సోమవారం కుక్కుటేశ్వర స్వామి వారికి త్రిశూల స్నానం వైభవంగా నిర్వహించారు. భక్తజన సందోహం నడుమ కుక్కుటేశ్వర స్వామి, రాజరాజేశ్వరి అమ్మవార్లకు త్రిశూల స్నానం ఆద్యంతం కన్నుల పండువగా జరిగింది. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు పట్టు వస్త్రాలు అలంకరించి, ఊరేగింపుగా తీసుకు వచ్చి వేదికపై అధిష్ఠింపజేశారు. వేద పండితుడు ద్విభాష్యం సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యాన అర్చకుల వేదమంత్రాల నడుమ ఈ కార్యక్రమం జరిగింది. ఆలయ ఈఓలు ఆర్.సౌజన్య, శ్రీనివాస్, ట్రస్టుబోర్డు చైర్మన్ ఆగొంటి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు. పలువురు భక్తులు స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లు విశేష అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

నేడు కుడుపూడి నామినేషన్

అమలాపురం టౌన్: శాసన మండలి ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా స్థానిక సంస్థల నియోజకవర్గం వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా కుడుపూడి సూర్యనారాయణరావు మంగళవారం నామినేషన్ వేయనున్నారు. మధ్యాహ్నం 2.30 గంటలకు కాకినాడ కలెక్టరేట్‌లో ఆయన నామినేషన్ దాఖలు చేస్తారని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర తెలిపారు. విజయవాడ నుంచి సూర్యనారాయణరావు మంగళవారం ఉదయం నేరుగా కాకినాడ చేరుకుని నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాకు చెందిన వైఎస్సార్ సీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, నాయకులు, శెట్టిబలిజ సామాజికవర్గ నాయకులు తరలి రావాలని నాగేంద్ర పిలుపునిచ్చారు.

'దివ్య'మైన అభయం

- టెన్త్ పరీక్షల్లో దివ్యాంగ విద్యార్థులకు బాసట
- వైకల్యం ఆధారంగా సహాయకులకు అనుమతి
- విద్యా శాఖ మార్గదర్శకాలు

రాయవరం: పదో తరగతి పరీక్షలు రాసే దివ్యాంగ విద్యార్థులకు ప్రభుత్వం బాసటగా నిలవనుంది. చదువులో వైకల్యం వారికి అడ్డు కారాదనే ఉద్దేశంతో పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సంబంధించి కొన్ని మినహాయింపులు ఇచ్చింది. వైకల్యం కారణంగా పబ్లిక్ పరీక్షలు రాసేందుకు వీలు లేని దివ్యాంగులకు సహాయకులను అనుమతించేలా వెసులుబాటు కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

'ప్రత్యేక' రాయితీలు

- విద్యాహక్కు చట్టం ప్రకారం బడి ఈడు ఉన్న చిన్నారులందరూ 14 ఏళ్లు వచ్చే వరకూ తప్పనిసరిగా చదువు కొనసాగించాలి. అయితే ప్రత్యేక అవసరాలు గల (దివ్యాంగ) చిన్నారులు ఉన్నత చదువులు చదవలేక మధ్యలోనే చదువును నిలిపివేయడం, బడికి వెళ్లకపోవడం జరుగుతూ ఉంటుంది. అటువంటి వారు కూడా ఉన్నత చదువులు చదవాలనే ఉద్దేశంతో ప్రభుత్వం వారికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తోంది.
- సాధారణ విద్యార్థులతో పాటు ప్రత్యేక అవసరాలు కలిగిన వారిని ఒకేలా చూడకుండా రెండేళ్ల క్రితం సానుకూల నిర్ణయం తీసుకున్నారు. పదో తరగతి చదువుతున్న ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు పరీక్షల్లో ఉత్తీర్ణత మార్కుల శాతాన్ని తగ్గించారు. దీంతోపాటు ప్రతి గంటకు 20 నిమిషాల అదనపు సమయం కేటాయిస్తున్నారు.
- గతంలో అంధత్వం, రెండు చేతులూ పని చేయని వారికి మాత్రమే పరీక్షలు రాసేందుకు ప్రత్యేక సహాయకులను అనుమతించేవారు. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి పాఠశాలల్లో ప్రత్యేక అవసరాల గల విద్యార్థులు పరీక్షల గండం నుంచి గట్టెక్కడానికి చేయూత అందించనుంది. మూగ, చెముడు మినహా అన్ని రకాల వైకల్యాలు కలిగిన విద్యార్థులకు పరీక్షలు రాసేందుకు సహాయకులను అనుమతించనున్నారు. ఇందుకు ప్రత్యేక సడలింపులు ఇస్తూ జీఓ–86 జారీ చేశారు.

2016 దివ్యాంగుల చట్టం ప్రకారం

దివ్యాంగుల చట్టం–2016 ప్రకారం ప్రభుత్వం 21 రకాల వైకల్యాలను గుర్తించింది. లెప్రసీ క్యూర్డ్, పర్మినెంట్ ఫిజికల్ ఎంపైర్‌మెంట్, స్పైనల్ కార్డ్ ఇంజూరీ, అభ్యసనా సామర్థ్య లోపం, మానసిక వైకల్యం, ఆటిజం, మానసిక రుగ్మత, బహుళ వైకల్యం, హిమోఫీలియా, తలసేమియా, సికిల్‌సెల్ ఎనీమియా, క్రానిక్ న్యూరాలజికల్ కండిషన్స్ వంటి వైకల్యాలు కలిగిన విద్యార్థులకు సహాయకులను నియమించుకునే వీలుంది. దీంతో ప్రతి విద్యార్థీ ఉత్తీర్ణత సాధించాలన్న విద్యా చట్ట, సమగ్ర శిక్ష ఆశయాల సాధనకు మార్గం సుగమమైనట్లవుతుంది.

జిల్లాలో పరిస్థితి ఇదీ

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో 115 మంది ప్రత్యేక అవసరాలు గల చిన్నారులు పదో తరగతి పరీక్షలు రాయనున్నారు. గతంలో ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకూ చదువుతున్న అన్ని రకాల వైకల్యాలు కలిగిన విద్యార్థులకు 35గా ఉన్న ఉత్తీర్ణత శాతాన్ని 20 శాతానికి సడలించారు. అలాగే ఫీజు మినహాయిస్తూ గతంలో పలు జీవోలతో మార్గదర్శకాలు ఇచ్చారు. విద్యార్థులు, తల్లిదండ్రుల విజ్ఞప్తుల నేపథ్యంలో పరీక్షల విధానంలో మరిన్ని మినహాయింపులు ఇస్తూ పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలు జారీ చేయడంపై ఆయా వర్గాలు సంతోషం వ్యక్తం చేస్తున్నాయి.

సద్వినియోగమవుతుంది



ప్రభుత్వం గుర్తించిన 21 రకాల వైకల్యాల్లో చెముడు, మూగ తప్ప మిగిలిన న్ని వైకల్యాలు కలిగిన విద్యార్థులు పరీక్షలు రాసేందుకు సహాయకులను నియమించుకోవచ్చు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇది ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది.

– ఎం.కమలకుమారి, జిల్లా విద్యాశాఖాధికారి, అమలాపురం

నిర్మలకుమారి కుటుంబానికి అండగా ఉంటాం

- ప్రభుత్వ విప్, కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి
- వ్యక్తిగతంతో రూ.5 లక్షల ఆర్థిక సాయం



నిర్మలకుమారి చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న విప్ జగ్గిరెడ్డి

ఆలమూరు: వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం మాజీ అధ్యక్షురాలు, జెడ్పీ మాజీ ప్రతిపక్ష నేత కొల్లి నిర్మలకుమారి (50) పార్టీకి అందించిన సేవలు మరువలేనివని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. ఆమె కుటుంబానికి పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఆలమూరులో సోమవారం జరిగిన నిర్మలకుమారి సంస్మరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నిర్మలకుమారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆ కుటుంబానికి వ్యక్తిగతంగా రూ.5 లక్షల ఆర్థిక సాయం అందించారు. అలాగే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో వైఎస్సార్ సీపీ తరఫున నిర్మలకుమారి కుమారుడు, కుమార్తెకు చెరొక రూ.10 లక్షల చొప్పున మొత్తం రూ.20 లక్షలు డిపాజిట్ చేసేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. నిర్మలకుమారి చిత్రపటానికి పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, ఎంపీపీ తోరాటి లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యురాలు తోరాటి సీతామహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా జాతీయ వుమెన్స్ హాకీ



మైదానంలో తలపడిన యూపీ - ఏపీ జట్లు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా క్రీడా మైదానంలో జాతీయ వుమెన్స్ సీనియర్స్ హాకీ చాంపియన్‌షిప్ పోటీలు సోమవారం హోరాహోరీగా జరిగాయి. మొదటి మ్యాచ్ పంజాబ్, హిమాచల్‌ప్రదేశ్ మధ్య జరిగింది. పంజాబ్ 2–0 స్కోర్‌తో విజయం సాధించింది. శరబ్‌దీప్‌కౌర్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కించుకుంది. రెండో మ్యాచ్‌లో ఉత్తర ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ జట్లు పోటీ పడ్డాయి. 3–2 స్కోర్‌తో ఉత్తర ప్రదేశ్ జట్టు విజయం కైవసం చేసుకుంది. ఒలింపిక్ సంఘ కార్యదర్శి కె.పద్మనాభం చేతుల మీదుగా ప్లేయర్ ఆఫ్ ది అవార్డును వినమ్రతా యాదవ్ అందుకుంది. మూడో మ్యాచ్‌లో తమిళనాడు, పాండిచ్చేరి తలపడ్డాయి. తమిళనాడు జట్టు 3–0 స్కోర్ తేడాతో విజయం సొంతం చేసుకుంది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును సోనియా గెలుచుకుంది. ఈ మ్యాచ్‌లను హాకీ ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యక్షుడు సూర్యప్రకాష్‌రాయ్, కార్యదర్శి హర్షవర్ధన్‌రెడ్డి, ట్రెజరర్ పీటర్, టోర్నమెంట్ కో ఆర్డినేటర్ వి.రవి రాజు, పరిశీలకుడు భూపేంద్రసింగ్, డైరెక్టర్ మహేష్, విక్రమ్ పర్యవేక్షించారు.

మానవత్వం చాటుకున్న సీఎం జగన్

- తలసేమియా బాధిత చిన్నారి వైద్య ఖర్చులకు రూ.15 లక్షల మంజూరు
- బాలికకు ఆల్ ది బెస్ట్ చెప్పిన కలెక్టర్ మాధవీలత



కలెక్టర్ మాధవీలతకు కృతజ్ఞతలు తెలుపుతున్న చిన్నారి తల్లిదండ్రులు రాజేష్, చందన భాను

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): తలసేమియా వ్యాధితో బాధ పడుతున్న ఐదేళ్ల చిన్నారి సీహెచ్ మాధురి (5) వైద్య సహాయానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.15 లక్షలు మంజూరు చేసింది. ఆమె తల్లిదండ్రులు చందన భాను, రాజేష్‌లు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గత నెల మూడో తేదీన కలిసి తమ బిడ్డకు కలిగిన కష్టాన్ని వివరించారు. అది విని చలించిపోయిన సీఎం మానవతాదృక్పథంతో స్పందించి, రూ.15 లక్షలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా మాధురి తల్లిదండ్రులు కలెక్టర్ మాధవీలతను సోమవారం కలెక్టరేట్‌లో కలిశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద రూ.10 లక్షలు, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్‌ఎఫ్) కింద రూ.5 లక్షలతో పాటు చికిత్స అనంతరం మరో రూ.లక్ష మేర ప్రభుత్వ పరంగా ఆర్థిక సహాయం అందిస్తామని చెప్పారు. ఇప్పటికే ప్రతి నెలా రూ.10 వేల పెన్షన్ అందిస్తున్నామన్నారు. సీఎంను కలిసిన 40 రోజుల వ్యవధిలోనే తమ కుమార్తె వైద్య ఖర్చులకు నిధులు మంజూరు చేయడం ఎంతో ఆనందంగా ఉందని మాధురి తల్లిదండ్రులు అన్నారు. హైదరాబాద్‌లోని సిటిజన్ హాస్పిటల్ యాజమాన్యంతో మాట్లాడి రూ.15 లక్షలకే వైద్యం చేసేలా ఒప్పించారని చెప్పారు. ముఖ్యమంత్రిని కలిసిన రోజే కలెక్టర్ తమ వివరాలు తెలుసుకుని, తక్షణ ఆర్థిక సహాయంగా రూ.లక్ష అందజేశారన్నారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి ఎప్పటికీ రుణపడి ఉంటామని కృతజ్ఞతలు తెలిపారు. చిన్నారి మాధురికి కలెక్టర్ మాధవీలత 'ఆల్ ది బెస్ట్' చెప్పారు.

క్రైం కార్నర్..

ఊరెళితే ఇల్లు దోచేశారు



కొత్తపేటలో చోరీ జరిగిన ఇంట్లో చిందరవందరగా పడేసిన బట్టలు



కొత్తపేటలో చోరీ జరిగిన ఇంట్లో పరిశీలిస్తున్న సీఐ, ఎస్సై

- కొత్తపేటలో భారీ చోరీ
- 415 గ్రాముల బంగారు, 7 కేజీల వెండి వస్తువుల అపహరణ
- సుమారు రూ.38 లక్షల సొత్తు దోపిడీ

కొత్తపేట: ఇంటికి తాళం వేసి, కుటుంబ సమేతంగా ఊరెళితే.. గుర్తు తెలియని దుండగులు ఇంట్లో చొరబడి బంగారం, వెండి వస్తువులన్నీ దోచుకుపోయిన సంఘటన కొత్తపేటలో సంచలనం రేపింది. దీనిపై బాధితుడు శ్రీకాకోళ్లపు విశ్వేశ్వర శ్రీనివాస్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలివీ.. శ్రీనివాస్ కొత్తపేట ఓల్డ్ బ్యాంక్ కాలనీలో నివసిస్తున్నాడు. సిద్ధి సుబ్రహ్మణ్యేశ్వర బ్యాంకర్స్ పేరుతో తాకట్టు, వడ్డీ వ్యాపారం చేస్తున్నాడు. బంగారం, వెండి వస్తువులపై వడ్డీకి డబ్బులు ఇచ్చి తాకట్టు వ్యాపారం నిర్వహిస్తున్నాడు. శ్రీనివాస్ భార్య లక్ష్మీమణిదీపిక తండ్రికి పి.గన్నవరంలో బంగారం, వెండి దుకాణం ఉంది. అక్కడి నుంచి ఆమె చిన్నచిన్న బంగారం, వెండి వస్తువులు తెచ్చి, ఇంటి వద్ద వ్యాపారం నిర్వహిస్తోంది. ఆ వస్తువులతో పాటు, తాకట్టు పెట్టుకున్న వస్తువులను కూడా ఇంట్లోనే భద్రపరిచారు. ఇదిలా ఉండగా శ్రీనివాస్ భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి శనివారం సాయంత్రం పి.గన్నవరంలోని మామగారింటికి వెళ్లాడు. ఆదివారం ఉదయం అక్కడి నుంచి అన్నవరం సత్యనారాయణస్వామి దర్శనానికి వెళ్లారు. సాయంత్రం వారి ఇంటికి ఎదురుగా నివాసం ఉంటున్న మహిళ ఫోన్ చేసి, గేటు తాళం వేసి ఉన్నా, లోపల మెయిన్ డోర్ తీసి ఉందని చెప్పింది. దీంతో శ్రీనివాస్ కుటుంబ సభ్యులు అన్నవరం నుంచి హుటాహుటిన రాత్రికి ఇంటికి చేరుకున్నారు. గుర్తు తెలియని దుండగులు పరుపు కింద పెట్టిన తాళంతో బీరువా తెరచి, దుస్తులు బయట పడవేసి, బంగారం, వెండి వస్తువులు దొంగిలించుకుపోయినట్టు గుర్తించారు. సుమారు 415 గ్రాముల బంగారం, సుమారు 7 కేజీల వెండి వస్తువులు పోయినట్టు గుర్తించారు. వాటి విలువ సుమారు రూ.38 లక్షలుంటుందని శ్రీనివాస్ తెలిపారు. అతడి ఫిర్యాదు మేరకు చోరీ జరిగిన ఇంట్లో రావులపాలెం సీఐ ఎస్.రజనీకుమార్, స్థానిక ఎస్సై వి.మణికుమార్ పరిశీలించారు. క్లూస్ టీమ్ వేలిముద్రలు సేకరించింది. పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

ఒక దొంగ.. 28 బైక్‌లు..

- పాత నేరస్తుడిని అరెస్టు చేసిన పోలీసులు
- చోరీ సొత్తు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బైక్‌లతో పోలీస్ అధికారులు

కాకినాడ క్రైం: వరుసగా ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతూ ఓ పాత నేరస్తుడు పోలీసులకే తలనొప్పిగా తయారయ్యాడు. అతడి కదలికలపై నిఘా ఉంచిన క్రైం పోలీసులు ఎట్టకేలకు సంకెళ్లు బిగించి, 28 బైక్‌లు రికవరీ చేశారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ శ్రీనివాస్ ఈ వివరాలు వెల్లడించారు. ఆయన కథనం ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరు మండలం వాడపల్లి గ్రామానికి చెందిన కోరాడ వెంకటేసులు పాత నేరస్తుడు. ద్విచక్రవాహనాల చోరీలో ఆరితేరాడు. గతంలో 45 బైకుల చోరీ కేసులో అరెస్టయ్యాడు. ఐదు నెలల క్రితమే జైలు నుంచి విడుదలైన అతడు.. తదనంతరం కాకినాడ, మండపేట, కడియం, రాజమహేంద్రవరం, తాడేపల్లిగూడెం, తణుకు, ఏలూరు, జంగారెడ్డిగూడెం, పెదపూడి పోలీస్ స్టేషన్ల పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడ్డాడు. అతడి కదలికలపై నిఘా పెట్టిన సెంట్రల్ క్రైం స్టేషన్ (సీసీఎస్) ప్రత్యేక బృందాలు వివిధ ప్రాంతాల్లో అతడు 28 బైకులు కొట్టేశాడని నిర్ధారించుకున్నారు. ఈ నేపథ్యంలో వెంకటేసులును సోమవారం కాకినాడలో అరెస్టు చేసి, కోర్టులో హాజరు పరిచారు. చెడు వ్యసనాలకు బానిసైన నిందితుడు దొంగతనాలకు అలవాటు పడ్డాడని అదనపు ఎస్పీ తెలిపారు. నిందితుడిని పట్టుకోవడంలో సీసీఎస్ డీఎస్పీ ఆధ్వర్యాన ఎస్సై క్రాంతి బృందం కీలకంగా వ్యవహరించిందని అదనపు ఎస్పీ తెలిపారు. ఐటీ కోర్ సాంకేతిక సాయంతో నిందితుడి జాడ తెలుసుకున్నామని చెప్పారు. విలేకర్ల సమావేశంలో స్పెషల్ బ్రాంచి డీఎస్పీ అంబికా ప్రసాద్ కూడా పాల్గొన్నారు.

ముసుగు వేసుకుని కత్తులతో దాడి

- వైఎస్సార్ సీపీ నాయకుడికి త్రుటిలో తప్పిన ప్రమాదం
- ఘంటావారిగూడెం వద్ద ఘటన



దుండగుల దాడిలో దెబ్బ తిన్న కారు

నల్లజర్ల: ఘంటావారిగూడెం ఎంపీటీసీ సభ్యురాలు యలమర్తి సూర్యకుమారి కుమారుడు, వైఎస్సార్ సీపీ నాయకుడు యలమర్తి వాసుపై సోమవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తులు కత్తులతో దాడికి యత్నించారు. ఈ దాడిలో వాసు త్రుటిలో సురక్షితంగా తప్పించుకున్నాడు. గ్రామ శివారులోని ఫామ్‌హౌస్‌లో మకాం ఉంటున్న వాసు.. మధ్యాహ్నం 12 గంటల సమయంలో తన స్నేహితులు చిడిపి రమేష్, మట్టా రాజేష్, తోట రాముతో కలసి తన కారులో రామన్నగూడెం సొసైటీకి వెళ్లాడు. అక్కడి నుంచి సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటి వద్దకు వచ్చాడు. అదే సమయంలో మంకీ టోపీలు ధరించిన ఇద్దరు వ్యక్తులు కొబ్బరి బొండాలు చెక్కే కత్తులతో వాసు వాహనంపై అకస్మాత్తుగా దాడికి దిగారు. కారులో వాసు ఒక్కడే వచ్చి ఉంటాడని డ్రైవింగ్ సీటుపై దాడికి దిగారు. వారు కత్తులతో చేసిన దాడిలో కారు ముందు, పక్కటద్దాలు పూర్తిగా పగిలిపోయాయి. అయితే డ్రైవింగ్ సీటులో మట్టా రాజేష్ ఉన్నాడు. ఈ దాడితో అప్రమత్తమైన మిగిలిన స్నేహితులు డోర్లు తీసుకొని కిందకు దిగారు. వారిని గమనించిన ఆగంతకులు పరారయ్యారు. దాడికి తెచ్చిన కత్తులను సంఘటన స్థలంలోనే వదిలి వెళ్లారు. ఈ దాడిపై నల్లజర్ల సీఐ లక్ష్మణరెడ్డి, ఎస్సై నరసింహమూర్తి విచారణ జరిపారు. స్టేట్‌మెంట్ రికార్డు చేశారు. ఆస్తి తగాదాలు, రాజకీయ కక్షలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని లారీ క్లీనర్ మృతి



మృతుడు దుర్గాప్రసాద్ (పాత చిత్రం)

గండేపల్లి: జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని వాహనం ఢీకొని లారీ క్లీనర్ మృతి చెందాడు. గండేపల్లి ఎస్సై వై.గణేష్ కుమార్ కథనం ప్రకారం.. జంగారెడ్డిగూడెం నుంచి కోడిగుడ్ల లోడుతో కోల్‌కతా లారీ వెళ్తోంది. మండలంలోని మురారి గ్రామ శివారు న్యూ అన్నపూర్ణ హోటల్ ఎదురుగా ఉన్న పాన్‌షాప్ వద్దకు వెళ్లేందుకు క్లీనర్ మాదాసు దుర్గాప్రసాద్ (32) రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో జగ్గంపేట వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్తున్న గుర్తు తెలియని వాహనం అతడిని ఢీకొంది. తీవ్రంగా గాయపడిన దుర్గాప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి స్వస్థలం పశ్చిమ గోదావరి జిల్లా తణుకు. దుర్గాప్రసాద్ బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గల్ఫ్‌లో బందీ అయిన మహిళకు విముక్తి

- ఎంపీ భరత్ జోక్యంతో అయిదు రోజుల్లోనే విడుదల
- కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబ సభ్యులు



ఎంపీ భరత్‌రామ్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న స్వరూపరాణి

రాజమహేంద్రవరం రూరల్: గల్ఫ్‌లో ఉద్యోగం పేరిట ఏజెంట్ చేతిలో మోసపోయిన మహిళ విషయంలో ఎంపీ మార్గాని భరత్‌రామ్ చొరవ ఫలించింది. బాధిత కుటుంబంలో ఆనందాన్ని నింపింది. వివరాలివీ.. రాజమహేంద్రవరం అన్నపూర్ణమ్మపేటకు చెందిన రేచర్ల జ్యోతి ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ ఏజెంట్ సహాయంతో మస్కట్ వెళ్లింది. ఏజెంట్ ఆమెకు టూరిస్ట్ వీసా ఇచ్చి మోసం చేశాడు. మస్కట్ వెళ్లిన తరువాత జ్యోతి ఈ విషయం తెలుసుకుంది. అప్పటికే ఆమె కష్టార్జితాన్ని ఏజెంట్ దోపిడీ చేసేశాడు. మస్కట్‌లో చిక్కుకున్న ఆమె మూడు నెలల పాటు మూడు ఇళ్లల్లో పనిమనిషిగా చేసింది. జీతం మాత్రం ఏజెంట్ తీసుకునేవాడు. ఇండియాకు తిరిగి వచ్చేద్దామంటే పాస్‌పోర్ట్ కాలపరిమితి ముగిసిపోయింది. దీంతో అక్కడి పోలీసులు జ్యోతిని అరెస్టు చేశారు. అయిదు నెలల తర్వాత విషయం తెలుసుకున్న జ్యోతి కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందారు. బాధితురాలి కుమార్తె స్వరూపరాణి ఎంపీ మార్గాని భరత్‌రామ్‌ను కలిసి తన తల్లికి ఎదురైన కష్టాన్ని వివరించింది. ఆయన వెంటనే స్పందించారు. కేంద్ర విదేశీ వ్యవహారాల మంత్రికి ఈ పరిస్థితులను నివేదించారు. ఎంపీ భరత్‌రామ్ విజ్ఞప్తి మేరకు ఆ దేశ ఎంబసీతో కేంద్ర మంత్రి మాట్లాడి, జ్యోతి విడుదలకు చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం పాస్‌పోర్ట్ కోసం ప్రయత్నిస్తున్నారు. నాలుగైదు రోజుల్లో జ్యోతి తిరిగి వచ్చే అవకాశముందని ఆమె కుమార్తె స్వరూపరాణి తెలిపింది. ఈ సందర్భంగా ఆమె సోమవారం ఎంపీ భరత్‌రామ్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపింది.

పోలవరం కాలువలోకి దూసుకుపోయిన లారీ

- లారీ డ్రైవర్ మృతి
- ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే తలారి



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

దేవరపల్లి: మండలంలోని బందపురం వద్ద జాతీయ రహదారిపై ఆదివారం రాత్రి లారీ ప్రమాదానికి గురైంది. ఈ దుర్ఘటనలో కృష్ణా జిల్లా విసన్నపేట మండలం పుట్రేల గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ రేసోజు పూర్ణచంద్రరావు (42) మృతి చెందాడు. వివరాలివీ.. కర్ణాటకలోని బళ్లారి నుంచి రాజానగరానికి బియ్యం బస్తాల లోడుతో ఈ లారీ వెళుతోంది. బందపురం సమీపాన పోలవరం కుడి కాలువ వద్ద డ్రైవర్‌కు కాలువ కనిపించలేదు. దీంతో లారీ సుమారు 10 మీటర్ల లోతులోకి దూసుకుపోయి, వంతెన పిల్లర్‌ను ఢీకొని బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాద స్థలాన్ని గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సోమవారం పరిశీలించారు. ప్రమాద కారణాలు తెలుసుకున్నారు. పోలవరం కుడి కాలువపై వంతెన నిర్మించిన అధికారులు సర్వీసు రోడ్డుకు మాత్రం వంతెన నిర్మించలేదని అన్నారు. సర్వీసు రోడ్డుకు వంతెన నిర్మించకపోతే ప్రమాదాలు జరుగుతాయని అప్పట్లో చెప్పినా అధికారులు పట్టించుకోలేదన్నారు. ఈ సమస్యను ఎంపీ మార్గాని భరత్‌రామ్ దృష్టికి తీసుకువెళ్లి, వంతెన నిర్మాణానికి కృషి చేస్తానని తెలిపారు.

గుండెపోటుతో నర్సు మృతి



గుండెపోటుతో మృతి చెందిన జయంతి (పాత చిత్రం)

తుని: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి ఏఆర్‌టీ సెంటర్‌లో నర్సుగా పని చేస్తున్న పల్లికల జయంతి (39) గుండెపోటుతో మృతి చెందారు. విధి నిర్వహణలో ఉండగా జయంతి ఆదివారం ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. విశాఖపట్నంలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందారని ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ నరేష్ తెలిపారు. మంచి సేవలు అందించిన జయంతి అకాల మృతి తీరని లోటని నరేష్ అన్నారు. ఆసుపత్రిలో జయంతి సంతాప సభ నిర్వహించి, నివాళులర్పించారు. వైద్యులు శిరీష, మహేష్, శశికళ, సాయికిరణ్, సహచర ఉద్యోగులు హేమ అనురాధ, శేఖర్, రాజీవ్ పాల్గొన్నారు.